క్లుప్తంగా

శ్రీవారి సేవలో ఏలూరు డీఎస్పీ

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని ఏలూరు నూతన డీఎస్పీ బి.శ్రావణ్‌కుమార్ సోమవారం సందర్శించారు. సతీసమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు ముందుగా దేవస్థానం అధికారులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు శ్రీవారి శేష వస్త్రాన్ని కప్పి వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఆలయ ఏఈఓ ఎం .దుర్గారావు స్వామివారి జ్ఞాపికను, ప్రసాదాలను అందజేశారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు సోమవారం రూ. 1,00,001 విరాళంగా అందజేశారు. కృష్ణా జిల్లా తిరువూరుకు చెందిన జవ్వాజి ప్రవీణ్‌కుమార్ ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ అధికారులు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

భగవద్గీత పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

బుట్టాయగూడెం: హైదరాబాద్ హరే కృష్ణ మూమెంట్, చైతన్య కృష్ణదాస్ ప్రభుజిత్ వారి ఆధ్వర్యంలో జరిగిన భగవద్గీత, భాగవతం జాతీయ స్థాయి పోటీల్లో స్థానిక విద్యారోహిణీ విద్యార్థులు ప్రథమ స్థానంలో గెలుపొందినట్లు విద్యారోహిణీ డిజిటల్ ప్రిన్సిపాల్ కొండేపాటి రామకృష్ణ తెలిపారు. సోమవారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ హైదరాబాద్, భద్రాచలం, నర్సాపురం, అహోబిలం, బుట్టాయగూడెం ప్రాంతాలకు సంబంధించి ఈ పోటీలు జరిగాయని అన్నారు. ఈ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు బొండాడ శివకార్తికేయ, మల్లాది సాత్విక, చెక్కా మేఘవర్షన్‌లు గెలుపొందారని ఆయన చెప్పారు. ఈ పోటీలకు విద్యార్థులను తీర్చిదిద్దిన ఐక్యవిద్య టీచర్ ఎస్. పుణ్యలక్ష్మిని ప్రిన్సిపాల్ అభినందించారు. అలాగే గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

ద్వారకాతిరుమల ఎంఈఓగా సుబ్బారావు

ద్వారకాతిరుమల: మండల విద్యాశాఖాధికారి–1 గా డి.సుబ్బారావు సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. కామవరపుకోట ఎంఈఓగా విధులు నిర్వర్తిస్తున్న ఆయన్ను ద్వారకాతిరుమలకు ఎఫ్ఏసీగా నియమించారు. దాంతో ఆయన స్థానిక విద్యావనరుల కేంద్రంలో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ–2 పరసా వెంకట్రావు, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు జి.దేవానందరావు, ఎస్ రాంబాబు తదితరులు సుబ్బారావుకు పూల బొకేను అందించి, అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండలశాఖ ప్రధాన కార్యదర్శి కట్టా శ్రీనివాసరావు, సహాధ్యక్షుడు పి.రాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోగులకు సక్రమంగా వైద్యసేవలు అందించాలి



కొయ్యలగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యాధికారులతో మాట్లాడుతున్న ఎంపీపీ

కొయ్యలగూడెం: రోగులకు వైద్య సిబ్బంది సక్రమంగా సేవలు అందించాలని ఎంపీపీ గంజీమాల రామారావు పేర్కొన్నారు. సీజనల్ వ్యాధులకు చికిత్సలు జరుగుగుతున్న విధానాన్ని ఎంపీపీ పీహెచ్‌సీకి వెళ్లి సోమవారం తనిఖీ చేశారు. 26 మందికి కంటి ఆపరేషన్లు చేయిస్తున్న విధానాన్ని ఆప్తాలమిక్ అసిస్టెంట్ చక్రవర్తిని అడిగి తెలుసుకున్నారు. డాక్టర్లపైనా, సిబ్బంది పైనా ఎలాంటి ఆరోపణలు రాకుండా అంకితభావంతో పని చేయాలని హితవు పలికారు. రక్తహీనతతో ఉన్న గర్భిణులతో మాట్లాడారు. వారికి అందుతున్న సేవలు గురించి ఎంపీపీ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ తస్లీమా, ఆప్తాలమిక్ అసిస్టెంట్ చలవాడ చక్రవర్తి ,హెల్త్ అసిస్టెంట్ దండే రామారావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

చింతలపూడి: జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి సి మధుబాబు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక కోర్టు వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పెండింగ్ కేసుల పరిష్కారానికి జాతీయ లోక్‌అదాలత్‌లను వినియోగించుకోవాలని సూచించారు. సెప్టెంబర్ 14న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌లో క్రిమినల్, సివిల్, బ్యాంక్ రికవరీ, చెక్ బౌన్స్ కేసులు, బీఎస్ఎన్ఎల్ రికవరీ, కుటుంబ తగాదా, మనోవర్తి, ప్రామిసరీ నోట్ కేసులు పరిష్కారం చేసుకోవచ్చునని తెలిపారు. కేసులు రాజీ చేసుకునే వారి కోసం ప్రతిరోజూ కోర్టులో ప్రీలోక్ అదాలత్ సిట్టింగ్స్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కోర్టుల్లో కేసుల సంఖ్య తగ్గించడానికి పోలీసులు, న్యాయవాదులు లోక్ అదాలత్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. సమాచారం కోసం దగ్గరలోఉన్న పోలీస్ స్టేషన్‌లను, కోర్టు సిబ్బందిని సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

బాబోయ్ దోమలు...



అల్లూరినగర్‌లో ఇళ్ల ముందే నిలిచి ఉన్న మురుగు నీరు

- గిరిజన గ్రామాల్లో మురికి గుంటల్లో నిలిచిన నీరు
- దోమల విజృంభణతో రోగాల బారిన ప్రజలు
- కానరాని ఫాగింగ్, దోమతెరలు
- పట్టించుకోని మలేరియా అధికారులు
- వరదలు ముంచెత్తి 24 రోజులవుతున్నా పారిశుధ్య చర్యలు శూన్యం

వేలేరుపాడు: విలీన మండలమైన వేలేరుపాడులో దోమలు విజృంభిస్తుండడంతో రాత్రివేళల్లో ఇక్కడి ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా పోతోంది. దోమకాటుతో మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, తదితర విష జ్వరాలతో ప్రజలు మంచం పడుతున్నారు. జ్వరపీడితులతో ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాల్సిన అధికారులే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఒక పక్క గోదావరి వరద, ఎడతెరపిలేని వర్షాలు, మరో పక్క పెద్దవాగు ప్రాజెక్ట్ ఆనకట్ట తెగిపోయి విధ్వంసం సృష్టించిన విషయం తెల్సిందే. దీనికి తోడు గోదావరి వరదలకు వ్యర్థాలు కొట్టుకొచ్చి గ్రామాల్లో ఖాళీస్థలాల్లో మురుగునీరు, చెత్తాచెదారం పేరుకుపోయాయి. గ్రామాల్లో తాగునీటి పంపుల వద్ద నీరు నిల్వ ఉండి లార్వా వృద్ధి చెందే ప్రమాదముందని తెలిసినా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో గ్రామాల్లో దోమలు, ఈగలు వృద్ధి చెందాయి. గ్రామాల్లో మురుగునీరు చేరి దోమల వ్యాప్తి రోజురోజుకూ విపరీతంగా పెరుగుతోంది.

కంటిమీద కునుకు లేకుండా...

గతంలో ఎన్నడూ లేనివిధంగా దోమల వ్యాప్తి విపరీతంగా పెరగడంతో రాత్రి వేళల్లో కంటిపై కునుకులేకుండా పోతోంది. రాత్రి పగలు తేడా లేకుండా దోమలు కుట్టి చంపుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. గతంలో ఇంట్లో ఫ్యాన్ వేస్తే ఆ ఫ్యాన్ గాలికి దోమలు వచ్చేవి కావని, ప్రస్తుత దోమలు ఫ్యాన్ గాలికి కూడా వెళ్లడం లేదని చెబుతున్నారు. కొందరు దోమల నివారణకు దోమలబ్యాట్, ఆలౌట్, జెట్ కాయిల్స్, అగరబత్తులు వాడుతూ కొత్త రోగాలు కొని తెచ్చుకుంటున్నారు. దోమల బ్యాట్ మినహా మిగతా వాటన్నిటితో వచ్చే పొగ ముక్కుల్లోకి చేరి ఆరోగ్యానికి హాని కలిగిస్తున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎక్కడా కానరాని ఫాగింగ్...

గత 24 రోజులుగా వరదలు మండలాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. వరద గ్రామాల్లో దుర్భర పరిస్థితి అధికారుల కళ్లెదుట అంతా స్పష్టంగా కనబడుతున్నా అన్ని రకాల చర్యలు తీసుకోవాల్సిన సంబంధిత జిల్లా అధికారులే ఫొటోలకు ఫోజులిచ్చి మిన్నకుంటున్నారు. వర్షాకాలం ప్రారంభం నుంచి ఒక్కసారి కూడా గ్రామాల్లో ఫాగింగ్ చేయలేదు. ఫాగింగ్ చేస్తే కొంతమేరకు దోమలు చనిపోయే అవకాశం ఉంది. పెద్దవాగు వల్ల 12 గ్రామాల్లో వందలాది ఇళ్లు కొట్టుకుపోయాయి. ఇళ్లు నిర్మించి ఉన్న ప్రదేశాల్లో పెద్ద పెద్ద గుంటలు ఏర్పడి నీళ్లు నిలిచిపోయాయి. పెద్దవాగు వల్ల కొట్టుకుపోయిన కమ్మరిగూడెం, మేడేపల్లి, అల్లూరినగర్, కోయమాధారం గ్రామాల్లో ఇళ్ల ముందే గుంటల్లో మురికి కాల్వల వలె నీరు నిలిచి ఉంది. అయినా గత్యంతరం లేక ఆయా గ్రామాల ప్రజలు ఆ ఇండ్లలోనే నివాసముంటున్నారు. ఆయా వరద గ్రామాల్లో కనీసం బ్లీచింగ్ చల్లిన దాఖలాలు లేవు.

దోమతెరలు కూడా పంపిణీ చేయలేదు

దోమల నివారణకు ఏసీఎం (ఆల్ఫాసైబర్ మెతిరిన్ 5 శాతం) పిచికారీ చేయాల్సిన అధికారులు ఏ గిరిజన గ్రామంలోనూ చేపట్టలేదు. వరద వచ్చి 24 రోజులు దాటుతున్నా దోమల నివారణకు తీసుకున్న చర్యలు శూన్యం. అధికారులు గిరిజన గ్రామాల్లో కనీసం దోమ తెరలు కూడా పంపిణీ చేయలేదు. గ్రామాల్లో మలేరియా దోమలు వ్యాప్తి చెందకుండా నివారించేందుకు ఏర్పాటు చేసిన మలేరియా అధికారులు నిర్లక్ష్యం నిద్ర వీడటంలేదనే ఆరోపణలు పుష్కలంగా ఉన్నాయి. గ్రామాల్లో మలేరియా జ్వరాలు ప్రబలుతున్నా కనీసం దోమల మందు పిచికారీ చేయించడంలేదు.

ఫాగింగ్ చేయలేదు



వరద గ్రామాల్లో నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు వృద్ధి చెందుతున్నాయి. వరద వచ్చి 24 రోజులు దాటుతున్నా ఒక్కసారి కూడా ఫాగింగ్ చేయలేదు. దోమ కాటు వల్ల రోగాల బారిన పడుతున్నాం.

– కొర్రి రామారావు, మేడేపల్లి

ఆసుపత్రుల పాలైనా దిక్కులేదు



దోమల వల్ల ఆసుపత్రుల పాలైనా పట్టించుకునే దిక్కులేదు. దోమల మందు పిచికారి చేసేందుకు చర్యలు చేపట్టాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

– కోర్సా మంగయ్య, కోయమాధారం



జగన్నాథపురంలో రహదారి పక్కనే ఉన్న మురికిగుంట



కోయమాధారంలో మురుగునీటి మధ్యనే మంచినీరు పట్టుకుంటున్న వైనం



కమ్మరిగూడెంలో ఇళ్ల ముందు నిలిచి ఉన్న మురికి కూపాలు

వరద బాధితులను తక్షణం ఆదుకోవాలి

వేలేరుపాడు: వరదల వలన నష్టపోయిన కుటుంబాలను, రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య డిమాండ్ చేశారు. మద్దిగట్ల గ్రామంలో సోడే సత్తిబాబు అధ్యక్షతన సోమవారం ఏర్పాటు చేసిన శాఖ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వరదల వలన మండలంలోని వందల కుటుంబాలు తీవ్రంగా నష్టపోయినా ప్రభుత్వం పట్టించుకోవటం లేదన్నారు. రైతులకు విత్తనాలు ఎరువులు పూర్తి ఉచితంగా ఇవ్వాలన్నారు. ఇల్లు నష్టపోయిన వారికి ఇల్లు నిర్మించి ఇవ్వాలని, ఇసుక మేటలు వేసిన భూములు సాగులోకి తీసుకురావాలన్నారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలన్నారు. సమావేశానంతరం నూతన శాఖ కమిటీ, మహిళా సమాఖ్య కమిటీలను 11 మంది సభ్యులతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వరదల వలన నష్టపోయిన 60 కుటుంబాలకు దుప్పట్లు, దుస్తులు అందించారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సన్నేపల్లి సాయిబాబు, కారం దారయ్య, మండల కార్యదర్శి బాడిశ రాము, జిల్లా కౌన్సిల్ సభ్యులు పిట్టా ప్రసాద్, నాయకులు కారం కుమారి, సోడే ప్రసాద్, సోడే నాగేశ్వరావు, ముత్యాలరావు, వీరబాబు, మడివి రామలక్ష్మి, సోడే దుర్గ, మడకం రాజేశ్వరి, మడివి మంగ, సోడే సూర్యకుమారి, సోడే మోనిక తదితరులు పాల్గొన్నారు.



వరద బాధితులకు దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

‘ఉపాధి’ బకాయిలు వెంటనే చెల్లించాలి

కుక్కునూరు: ఉపాధి కూలీలకు పెండింగ్ ఉన్న బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం కుక్కునూరు మండలంలోని పెదరాయిగూడెం సచివాలయం ఎదుట ధర్నా చేశారు. పల్లెల నాగలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏలూరు జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వరకా శ్యామల మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను దృష్టిలో పెట్టుకొని ఉపాధి కూలీలకు 200 రోజుల పని దినాలు కల్పించాలని, దినసరి వేతనం రూ.600 ఇవ్వాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కాగా ఉపాధి కూలీలకు పని ప్రదేశంలో మంచినీళ్లు, మజ్జిగ, మెడికల్ కిట్లు, టెంట్లు వంటి మౌలిక వసతులు కల్పించడంతో పాటు చిన్న పిల్లల తల్లులకు ఆయాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ ధర్నాలో కుక్కునూరు సీపీఐ మండల కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి, జిల్లా కౌన్సిల్ సభ్యులు కొన్నె లక్ష్మయ్య, మండల కౌన్సిల్ సభ్యులు పల్లెల భిక్షం, సీతమ్మ, నాగలక్ష్మి, జయమ్మ, భూలక్ష్మి, గాడిద వెంకటరమణ తదితరలు పాల్గొన్నారు.



పెదరాయిగూడెం సచివాలయం ఎదుట ధర్నా చేసి, వినతిపత్రం అందజేస్తున్న ఉపాధి కూలీలు

బుట్టాయగూడెంలో ఉపాధి కూలీల ధర్నా

బుట్టాయగూడెం: ఉపాధి కూలీల బకాయిలు వెంటనే చెల్లించేలా అధికారులు కృషి చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్ డిమాండ్ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉపాధి కూలీలతో కలిసి సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధి కూలీల బకాయిలను విడుదల చేశామని ప్రకటిస్తున్నప్పటికీ ఆ సొమ్ములు కూలీలకు అందలేదని అన్నారు. ఎంతో శ్రమతో ఉపాధి పనులు చేసిన కూలీలకు నాలుగు నెలలైనా బకాయిలు చెల్లించకపోవడం వల్ల వారి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. ఇప్పటికైనా అధికారులు సొమ్ములు చెల్లించే విధంగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు బి.డేవిడ్‌రాజు, వై.రాజు, బుడుపుల విజయరాజు, ఎం.వెంకటేశ్వరరావు, టి.సామేలు, తదితరులు పాల్గొన్నారు.

ఆగని గుప్త నిధుల వేట

కుచ్చుల మెట్టపై గుర్తు తెలియని వ్యక్తుల పూజలు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమలలో గుప్త నిధుల వేట ఆగలేదు. స్థానిక కుచ్చుల మెట్టపై శిథిలమైన శ్రీవారి మండప ప్రాంతంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు గుప్త నిధుల కోసం కొద్దిరోజుల క్రితం తవ్వకాలు జరిపిన విషయం తెలిసిందే. అయితే తవ్వకాలు జరిపే సమయంలో ఒక బండరాయి కింద నుంచి తాచుపాము రావడంతో అటుగా వెళ్లేందుకు ఎవరూ సాహసించలేదు. పాము వచ్చింది కాబట్టి గుప్త నిధులు ఉన్నాయన్న ప్రచారం జోరుగా సాగింది. ఇదిలా ఉంటే గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి తవ్వకాలు జరిపిన ప్రాంతంలో పసుపు కుంకుమలతో పూజలు చేశారు. అలాగే అక్కడ ఒక చెట్టు కింద బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల చిత్రపటాన్ని ఉంచి పూజలు నిర్వహించారు. సోమవారం ఉదయం అటుగా వెళ్లిన వారు పసుపు కుంకుమలను చూసి గ్రామస్తులకు చెప్పడంతో అంతా గుప్త నిధుల కోసం చర్చించుకుంటున్నారు.



గుర్తు తెలియని వ్యక్తులు తవ్వకాలు జరిపిన ప్రాంతంలో ఉన్న పసుపు, కుంకుమలు

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

కామవరపుకోట: మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని స్థానిక ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎం.మల్లేశ్వరరావు అన్నారు. సోమవారం ఆడమిల్లిలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత అభియాన్ కార్యక్రమంలో భాగంగా మత్తు పదార్థాల వలన కలిగే దుష్పరిణామాలు గూర్చి వివరిస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ ఎం.మల్లేశ్వరరావు మాట్లాడుతూ యువత చెడు మార్గాలకు దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్ బారిన పడి ఎందరో జీవితాలు దుర్భరమయ్యాయన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రుల కష్టాలను గుర్తుపెట్టుకుని క్రమశిక్షణతో చదువుకుంటూ భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కె.ఇందిరాకుమారి, ధారావతు మల్లేష్, ఎం.విజయ్‌కృష్ణ, పి.ఏడుకొండలు, సిబ్బంది జె.అన్నపూర్ణమ్మ, ఎం.రత్నసిరిలో, ఆర్.కుమార్ రాజా పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న కళాశాల అధ్యాపకులు

డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకై ప్రతిజ్ఞ

కొయ్యలగూడెం: డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకై ప్రతి ఒక్కరూ కృత నిశ్చయంతో ముందుకు సాగుదాం అని ప్రభుత్వ మండల స్థాయి అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ పాటించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కె.చెల్లన్నదొర ఆధ్వర్యంలో నషా ముక్తభారత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నానాటికి డ్రగ్స్ సమాజంలో పెరిగిపోతున్నాయని దీనివల్ల యువత నిర్వీర్యం అవుతుందని తహసీల్దార్ హెచ్చరించారు. స్వచ్ఛంద సంస్థలను కలుపుకొని డ్రగ్స్ పై విద్యార్థుల్లో యువతలో అవగాహన కల్పించాలని, తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు తమ పిల్లలపై పర్యవేక్షణ ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్, విద్యుత్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యాశాఖకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

మీకోసంలో 10 అర్జీలు

జంగారెడ్డిగూడెం: మీ కోసంలో వచ్చే అర్జీలన్నీ సంతృప్తికర స్థాయిలో పరిష్కరించాలని ఆర్డీవో కె.అద్దయ్య అధికారులను ఆదేశించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మీకోసంలో వచ్చే ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, అర్థవంతమైన పరిష్కారానికి అధికారులు కృషిచేయాలన్నారు. పరిష్కారానికి అనువుగా లేని దరఖాస్తులపై సంబంధిత అర్జీదారులకు వివరాలు తెలియజేయాలన్నారు. సోమవారం నాటి మీకోసం కార్యక్రమంలో 10 దరఖాస్తులు వచ్చినట్లు ఆర్డీవో తెలిపారు. భూమిని ఆన్‌లైన్ చేయాలని, వ్యవసాయ భూమికి పాస్‌బుక్‌లు ఇప్పించాలని, వెబ్‌లాండ్‌లో పేరుమార్పు కోసం, తన భూమిలో వ్యవసాయం చేయనీయకుండా అడ్డుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని తదితర సమస్యలపై అర్జీలు వచ్చినట్లు చెప్పారు.

పురోహిత సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక

జంగారెడ్డిగూడెం: వేద గాయత్రి పురోహిత సంఘం నూతన కార్యవర్గం సోమవారం ఎన్నికైంది. స్థానిక పేరంపేట రోడ్ శివాలయం వద్ద ప్రధాన సభ్యుల సమావేశం నిర్వహించారు. బ్రాహ్మణ సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చీఫ్ అసోసియేట్ సెక్రటరీ, చిలుకూరి సాయిబాబు మాట్లాడుతూ బ్రాహ్మణులు అందరూ పార్టీలకు అతీతంగా కలిసిరావాలని పిలుపునిచ్చారు. పౌరోహిత్యాన్ని బ్రాహ్మణ కుల వృత్తిగా ప్రభుత్వం గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో నూతన కార్యవర్గ సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం సంఘం అధ్యక్షుడు భాస్కరశాస్త్రి, కార్యదర్శి శ్రీకృష్ణ, ఆంధ్రప్రదేశ్ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్షుడు గంగాధర శాస్త్రి, ఏలూరు జిల్లా అధికార ప్రతినిధి మనోజ్‌లను సన్మానించారు. ప్రాంతీయ బ్రాహ్మణ పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన

ద్వారకాతిరుమల: ఫ్యాప్టో పిలుపు మేరకు మండల స్థాయి వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌ను బాయ్‌కట్ చేస్తున్నట్లు ఏపీ యూటీఎఫ్ నేతలు, పలువురు ఉపాధ్యాయులు ఎంఈవో–2 పరసా వెంకట్రావుకు సోమవారం నోటీసును అందజేశారు. తాము వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌కు వ్యతిరేకమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు జి.దేవానందరావు, ఎస్ రాంబాబు, ప్రధాన కార్యదర్శి కట్టా శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులు వరప్రసాద్, ఉపాధ్యాయులు ఉన్నారు.

కేన్సర్‌పై అవగాహన ర్యాలీ

కొయ్యలగూడెం: ప్రభుత్వం చేపట్టిన కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను ప్రజలు అందరూ చేయించుకునేలా అవగాహన కలిగించాలని పీఎంపీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకరరావు పేర్కొన్నారు. సోమవారం పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కేన్సర్ అవగాహన ర్యాలీ, సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొయ్యలగూడెం పీహెచ్‌సీలో డాక్టర్ ఎస్తేరు రాణి ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించి కేన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందికి సూచించారు. ఈనెల 15వ తేదీ తరువాత ఇంటింటికీ పరీక్షలు నిర్వహించనున్నామని ప్రజలు ఇందుకు సహకరించాలని ఈ సందర్భంగా కోరారు. కేన్సర్‌కి కారణం అవుతున్న ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించుకోవాలన్నారు. అనంతరం హాస్పిటల్ నుంచి జాతీయ ప్రధాన రహదారి మీదుగా గణేష్ సెంటర్ వరకు కేన్సర్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఆనందం సుబ్బారావు ఆధ్వర్యంలో మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పీఎంపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు, డాక్టర్ ఎం .శ్రావణి, జిల్లా కార్యదర్శి జయరాం, జితేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్య ద్వారానే పేదరిక నిర్మూలన సాధ్యం

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్

బుట్టాయగూడెం: విద్య ద్వారానే పేదరిక నిర్మూలన సాధ్యమని, కావున ప్రతి ఒక్కరూ విద్యనభ్యసించాలని, అలాగే మారుమూల గ్రామాల్లో నివసిస్తున్న గిరిజనులు వారి ఆరోగ్యాల పట్ల పూర్తి శ్రద్ధ తీసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. బుట్టాయగూడెం మండలం ముంజులూరు గ్రామంలో సోమవారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమ్‌కుమార్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు వ్యక్తిగత శుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యవంతులుగా ఉండవచ్చని అన్నారు. అదేవిధంగా గిరిజన హక్కులు, సంక్షేమ పథకాలు, న్యాయ సేవాధికారి సంస్థలు అందించే ఉచిత న్యాయసేవలపై గిరిపుత్రులకు అవగాహన కలిగించారు. అనంతరం ముంజులూరు గ్రామంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. అక్కడ విద్యార్థులకు అందిస్తున్న వసతులు, మధ్యాహ్నభోజన పథకం అమలుపై ఆరా తీశారు. ఈ వైద్యశిబిరంలో సుమారు 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం పులిరామన్నగూడెం పాఠశాల, వసతిగృహాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. రత్నప్రసాద్ సందర్శించారు. ఈవ్‌టీజింగ్, మాదకద్రవ్యాలు వంటి వినియోగం వల్ల కలిగే నష్టాలను, అందుకు పడే చట్ట పరమైన శిక్షలను విద్యార్థులకు వివరించారు. రాజ్యాంగం అందరికీ కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ముళ్లపూడి శ్రీనివాసరావు, సభ్యులు ఉద్దండం ఏసుబాబు, ఏవీవీ భువనేశ్వరి, ఎం.క్రాంతికుమార్, మేకల రామ్మోహన్‌రావు, ఎం.నాగులు, పిల్లి పెద్దిరాజు, పారా లీగల్ వలంటీర్స్, ఎస్సై కె. వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



ముంజులూరు పాఠశాలలో పాఠ్యాంశాలపై విద్యార్థిని ప్రశ్నిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్